సరస్వతీ నమస్తుభ్యం..!



రేపల్లెలో సరస్వతీ దేవిగా బూరుగులమ్మ



సరస్వతీ దేవిగా బండ్లమ్మ దర్శనం



ఈపూరులో సరస్వతీ దేవిగా కనకదుర్గమ్మ



సరస్వతీ దేవిగా భ్రమరాంబ దర్శనం

- సరస్వతీ దేవిగా అమ్మవార్ల దర్శనం
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం

పిట్టలవానిపాలెం : మండలంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం దేవీ శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సరస్వతీదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న లింగోద్భవ స్వామి దేవాలయంలో, బగళాముఖి అమ్మవారి దేవాలయంలో అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరణ గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి మాట్లాడుతూ మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్లు, గోరువెచ్చని ఆవు పాలు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పన్నూరుకు చెందిన శ్యాంసంగ్ డిస్ట్రిబ్యూటర్ కె.శ్రీనివాసరావు, పెందుర్తి విజయసాయి, చందోలుకు చెందిన మార్పు కాంతారావు, కోడూరుకు చెందిన ఎనికేపల్లి శ్రీనివాసబాబు సహకారం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బండ్లమ్మ దేవాలయం, అల్లూరు శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయం ధర్మకర్తల మండలి చైర్మన్‌లు మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, వాలి వెంకట శివారెడ్డి పాల్గొన్నారు.

సరస్వతీ మాతా పాహిమాం

రేపల్లె రూరల్: బ్రహ్మ చైతన్య స్వరూపిణి, శార్వాణీ సరస్వతీ మాత అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం పట్టణంలోని పలు దేవాలయాలలో మహిళలు, చిన్నారులు, భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు మహిళలు హారతులు పట్టారు. పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత బూరుగులమ్మ, ఇసుకపల్లిలో చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ, స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవి భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయాల ఆవరణలో మహిళలు దుర్గాదేవి భక్తి గీతాలు, శ్రీ లలితా సహస్ర నామపారాయణం చేశారు. స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు ఏర్పాటు చేసిన బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులతో సరస్వతీ పూజా కార్యక్రమాలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొనటంతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయాల కమిటీల సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనకదుర్గాంబ..

మోదుకూరు(వేమూరు): చుండూరు మండలం మోదుకూరు గ్రామంలోని కనకదుర్గాంబ సమేత రామచౌడేశ్వరి దేవస్థానంలో శుక్రవారం సరస్వతీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను అర్చకులు మామిడిపల్లి నాగేశ్వరశర్మ నిర్వహించారు.

సత్యజ్ఞానం..సరస్వతీ దేవి దర్శనం

కొల్లూరు : కోటిపల్లి సోమశేఖరాలయంలో శుక్రవారం సత్యజ్ఞాన ప్రసూనాంబ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లూరు పార్వతీ అమ్మవారి ఆలయం, ఆవులవారిపాలెం, పెసర్లంక, చిలుమూరు తదితర గ్రామాలలోని ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు వైభవంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సామూహిక సరస్వతీ పూజ

భట్టిప్రోలు: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సరస్వతీ అమ్మవారికి చిన్నారులతో సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దుల గణేష్‌కుమార్–దుర్గా విజయలక్ష్మి (విజయవాడ) దంపతులు పూజా సామగ్రి, చిన్నారులకు స్టేషనరీ అందించారు. మహిళా కమిటీ నిర్వాహకులు ఎం. శశికళ, పి. నిర్మల, ఎంవీహెచ్ ధనలక్ష్మి, టీపీ హారిక పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకారాల్లో అమ్మవార్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో ఆరో రోజు శుక్రవారం శ్రీ భ్రమరాంబ అమ్మవారు కాత్యాయనిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐలవరంలో కామాక్షి దేవి చంద్రమౌళేశ్వరస్వామి అనంత నాగేంద్రస్వామి వార్ల దేవస్థానంలో అన్న సమారాధన జరిగింది. సాయంత్రం లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, కూరపాటి రఘురామయ్య పాల్గొన్నారు. భట్టిప్రోలులో శ్రీ గుండి పార్వతి, వెల్లటూరులో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో చిన్నారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ పర్యవేక్షించింది. శ్రీ అశ్వద్ దేవతా వన వృక్షం వద్ద శ్రీ కనకదుర్గమ్మ, పెదపులివర్రు రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో బాలా త్రిపురసుందరి, శ్రీ పేరిందేవి అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



కోటిపల్లి సోమశేఖరాలయంలో..



కాత్యాయనిగా భ్రమరాంబ



పేటేరులో గుండెపాటమ్మ అలంకరణ



వెల్లటూరులో సరస్వతిదేవిగా శ్రీకనకదుర్గమ్మ



నల్లమోతువారిపాలెంలో పూజలందుకున్న అమ్మవారు

సరస్వతి దేవిగా దుర్గాదేవి

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగాంబికా సమేత ఆనందీశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం మూలానక్షత్రం అమ్మవారు సరస్వతీ దేవిగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గుర్రం వెంకటేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం వేద పండితులు కమిటీ సభ్యులు నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ, చైర్మన్ ఓగిరాల వీరాస్వామి, అర్చకులు ప్రయాగ రాంబాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా అమ్మవార్లు

కర్లపాలెం: మండల కేంద్రంలోని కాళికాంబ ఆలయం, ఆర్య వైశ్య కల్యాణ మండపం, పెద్దింటమ్మ ఆలయం, కొత్త నందాయ పాలెంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం, నల్లమోతువారి పాలెంలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ ఆలయం, మహా చంద్రమౌళేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అర్చనలు, అభిషేకాలు చేశారు. బోలాయపాలెం గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవికి సరస్వతీదేవిగా అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. అమ్మవారి మండపాల వద్ద భక్తులు అమ్మవారి పాటలతో భజనలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

వైభవంగా దసరా ఉత్సవాలు



సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు..

బాపట్ల అర్బన్: శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాపట్ల పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలోని నవ రాత్రి పూజా మండపంలో శుక్రవారం అమ్మవారు మూల నక్షత్రం సందర్భంగా 'సరస్వతీ దేవి' అలంకరణలో దర్శనమిచ్చారు. సరస్వతీ దేవికి సర్వోపచారాలతో కుంకుమార్చన, పద్మ పుష్పార్చన నిర్వహించారు. విద్యార్థులతో సరస్వతీ మంత్ర పఠనం చేయించారు. లేహ్య ప్రసాదం పంపిణీ చేశారు. విద్యాధిష్ఠాన మూల స్వరూపమైన సరస్వతీ దేవిని దర్శించుకున్న వారికి విద్యా, మేధస్సుతో పాటు ఆయురారోగ్య ఐశ్వర్యాలు చేకూరతాయని పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు అమ్మవారి విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో పంగులూరి కౌండిన్యశర్మ, దర్శి ప్రశాంత్, ఉప్పాల హరికృష్ణ గౌడ్, వక్కలగడ్డ బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.



సరస్వతి దేవిగా దుర్గాదేవి



అల్లూరు లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో..

వేడుకగా సరస్వతీదేవికి పూజలు

కొల్లూరు : మండలంలోని ఈపూరు కనకదుర్గమ్మ ఆలయంలో అత్యంత వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ గావించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో విద్యార్థులతో ప్రత్యేకంగా సరస్వతీ పూజలు జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో వరిలో తెగుళ్ల నివారణ



నిజాంపట్నం: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వరి పైరులో తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ డీఎల్ఎంపీ మోహన్ అన్నారు. ఆముదాలపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. నాము తెగులు, పచ్చ పురుగును నివారించినట్లైతే అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. పండు తెగులు నివారణకు గోమూత్రం, పేడ, ఇంగువతో ద్రావణాన్ని తయారు చేసి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం బెల్లం ద్రావణం పిచికారీ చేస్తే.. పంట బలంగా ఏపుగా వస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పండించిన పంటను తినడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రసాద్ ఆశీర్వాదు, వెంకట మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

31న ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

రేపల్లె: కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం అలుపెరుగని పోరాటాలను నిర్వహిస్తున్న ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాలను రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఈ నెల 31న నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర నాయకుడు పి.నాగాంజనేయులు, ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నగదు రహిత మెషీన్ల పంపిణీ



వేమూరు(చుండూరు): యూనియన్ బ్యాంక్ గ్రామ పంచాయతీలకు నగదు రహిత మెషీన్లు పంచాయతీ కార్యదర్శులకు అందజేయడం జరిగిందని ఎంపీడీవో సుగుణమ్మ చెప్పారు. చుండూరు మండలంలోని పది గ్రామ పంచాయతీలకు మిషన్లను యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజరు స్వాతి శుక్ర వారం వాటిని పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ పంచాయతీ పన్ను వసూలుకు, నగదు రహిత చెల్లింపులకు మెషీన్లు అందజేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి కుమారస్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

భట్టిప్రోలు: స్వయం సహాయక సంఘాలకు, ఈసీ సభ్యులకు విజన్ బిల్డింగ్‌పై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ సంఘంలో జరిగే ఆర్థిక లావాదేవీలను నమోదు చేయాలని తెలిపారు. రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు కొలకలూరి రజనీ కుమారి, కొండెపాటి సాంబయ్య, దాసరి హనోకు, అకౌంటెంట్ బత్తుల శిరీష పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ఐలవరం(భట్టిప్రోలు): తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శివనాగేశ్వరమ్మ అన్నారు. ఐలవరం ఆర్బీకే పరిధిలో సుబ్బారావు అనే రైతుకు చెందిన పంట పొలంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పురుగులను అరికట్టేందుకు సూచనలిచ్చారు. పంటలను ఆశించే పచ్చ, లద్దె పురుగులను సామూహికంగా నశింప చేసేందుకు అగ్ని అస్త్రం తయారీ విధానాన్ని రైతులకు స్వయంగా చూపారు. కార్యక్రమంలో ఎంటీలు బాల, కె.ఆర్పీ పాండురంగారావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యం ద్వారానే తెగుళ్ల నివారణ

తాడికొండ: పత్తి పంటలో సమగ్ర యాజమాన్యం ద్వారానే తెగుళ్ల నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ పి రామాంజనేయులు అన్నారు. తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాట్స్ సెంటర్ శాస్త్రవేత్తలు శ్రీలత, వాణి, ఏవో రాజవంశీలతో కలిసి గ్రామంలోని పలు పంట పొలాల్లో పత్తి పంటను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన పంట దిగుబడికి సమగ్ర యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. అందులో భాగంగా సేంద్రియ ఎరువుల వాడకం, పచ్చిరొట్ట, జీవన, వానపాముల, పశువుల ఎరువులు వాడకం వలన సూక్ష్మజీవుల సాంద్రత ఎక్కువగా ఉండటం వలన నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పత్తి పంటలో యాజ మాన్య పద్ధతులు, మందుల పిచికారీ విధానం తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి కె శ్రీరంజని, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఎ సాయి రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో.. మెరుగైన వైద్యం



పోతార్లంకలో మెడికల్ కిట్ అందజేత

కొల్లూరు : మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. శుక్రవారం పోతార్లంకలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పావని, మౌనిక, వి.కావ్యతేజ, బి.రాజ్‌కుమార్, ఎస్. సుష్మ 696 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఎంపీటీసీ గాలి ఎస్తేరు రాణి, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, సచివాలయ సెక్రటరీ మహేష్ పాల్గొన్నారు.

370 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె: పోటుమెరక గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో మోళ్లగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 370 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు పాల్గొన్నారు. అలాగే శనివారం తుమ్మల మండల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివపార్వతి తెలిపారు.

తాగు, సాగు నీరందించిన ఘనత కోనకే సొంతం



కోన ప్రభాకరరావు విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రఘుపతి

బాపట్ల: బాపట్ల నియోజకవర్గానికి తాగు, సాగు నీరందించిన ఘనత మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావుకే దక్కిందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కోన ప్రభాకరరావు 34వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక పాతబస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ కోన ప్రభాకరరావు క్రీడా, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. బాపట్ల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, పార్టీ నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, చింతల రాజశేఖర్, చేజర్ల సతీష్, షేక్.సయ్యద్ పీర్, నవీద్, జోగి రాజా, కుర్రా రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు వినతి

బాపట్ల పట్టణంలోని దగ్గుమల్లివారి పాలెంలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే కోన రఘుపతికి వినతి పత్రాన్ని శుక్రవారం అందించారు. బాపట్ల పట్టణంలోని 29, 30, 31, 32, 33, 34వార్డుల పరిధిలోని ప్రజలు వివేకానంద కాలనీకి వచ్చి వైద్య సేవలు పొందాలంటే చాలా ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు జోగి రాజా, అడే చందు, గొర్రెముచ్చు పుష్పరాజ్యం, పద్మ, షేక్.సయ్యద్ పీర్ ఉన్నారు.

ముస్లింల సంక్షేమమానికి వైఎస్సార్ సీపీ కృషి

ముస్లింల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బాపట్ల పట్టణంలోని మదీనా మసీదు అదనపు భవనం శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కోన రఘుపతి లక్ష రూపాయలు విరాళాన్ని అందించారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వ పలు కార్యక్రమాలను చేపట్టిందని ఎమ్మెల్యే అన్నారు. మార్కెట్ వద్ద ఉన్న షాదీ ఖానాను కూడా అభివృద్ధి చేసేందుకు అంజుమన్ కమిటీకి బాధ్యతలను అందిస్తున్నామని వెల్లడించారు. మసీదు అధ్యక్షుడు ముస్తాఫా మాట్లాడుతూ బాపట్లలో రోడ్ల విస్తర్ణ సమయంలో మసీదుల తొలగింపు సమయంలో ఎంతో తోడ్పాటునందించిన ఎమ్మెల్యే కోన రఘుపతిని ముస్లింలు ఎప్పుడూ మరిచిపోరన్నారు. అంజుమన్ మసీదు కాంప్లెక్స్ ఏర్పాటుకు విశేష కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, అంజుమన్ నాయకులు జిలాని, అఫ్జల్, నవీద్, కరీమ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పట్టణంలోని వివేకానంద కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న సురక్ష వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ పేదవాడు ఆరోగ్యం కోసం అప్పులు చేసే పరిస్థితి నుంచి దూరం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, నర్రావుల వెంకట్రావు పాల్గొన్నారు.

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో అమృత కలశ యాత్ర



బాపట్ల అర్బన్: స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు చిరస్మరణీయమని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో గుంటూరు నెహ్రూ యువ కేంద్రం, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ – టీమ్ సీసీఏ ఆధ్వర్యంలో నా మట్టి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బ్లాక్ స్థాయి అమృత కలశ యాత్ర నిర్వహించారు. పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి బియ్యం, మట్టిని సేకరించి ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో నిర్వహించబోయే జాతీయ స్థాయి కార్యక్రమంలో సమర్పించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ నజీర్ మాట్లాడుతూ కన్నతల్లిని, మాతృ భూమిని మరువకూడదన్నారు. డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్ విద్యార్థులతో కలిసి అమృత కలశ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కె.శివకృష్ణ, కళాశాల హెచ్‌ఓడీలు డాక్టర్ కేవీఎల్ఎస్ ఆచార్యులు, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ అరుణ, డాక్టర్ సుబ్రమణ్యం, ఎస్.కిరణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఆర్బీకేల్లో ఎలుకల మందు పంపిణీ

వేమూరు: రైతు భరోసా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణకు శనివారం మందు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి చందోలు సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు నూనె, నూకలు తీసుకొని వస్తే ఎలుకల మందు కలిపి రైతులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

రేపల్లెలో..

రేపల్లెరూరల్: మండలంలోని ఆర్బీకేల్లో శనివారం ఉదయం 8 గంటలకు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బుష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలుకల మందును ఉచితంగా పంపిణీ చేసి, మందు వాడకంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.